క్లుప్తంగా

ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం సోదరీ,సోదరులకు, మత పెద్దలకు ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్ మీరా బుధవారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ముస్లిం కుటుంబాలకు చెందిన వారందరూ ఆనందోత్సాహాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

శివకామేశ్వరీ అమ్మవారికి అష్ట గంధంతో పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వ ర్యాన గంధం, అష్ట గంధంతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

పోలీసు చలివేంద్రం ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసుశాఖ ప్రజల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగర డెప్యూటీ పోలీసు కమిషనర్ టి.హరికృష్ణ అన్నారు. నగర పోలీసు కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు బుధవారం నున్న పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర డీసీపీ టి.హరికృష్ణ ప్రారంభించారు. అనంతరం కండ్రిక జంక్షన్, అవర్ విలేజిల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కూడా డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నార్త్ డివిజన్ ఏసీపీ డీఎస్‌పీ ప్రసాద్, సీఐ ఎస్.దుర్గాప్రసాద్ స్టేషన్ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

'బొండా' ఓట్లను రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమా మహేశ్వరరావు, అతని కుటుంబ సభ్యుల ఓట్లు అజిత్ సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ రోడ్డులో ఉన్న కమర్షియల్ బిల్డింగ్ అయిన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆ ఓట్లను పరిశీలించి వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఒగ్గు గవాస్కర్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ తదితరులు కలెక్టర్ ఢిల్లీరావుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న వారు బొండా ఉమా, అతని కుటుంబ సభ్యుల ఓట్లు అజిత్ సింగ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయం అడ్రస్‌లో ఉన్నాయని, కుటుంబాలు ఉండని కమర్షియల్ బిల్డింగ్‌లో ఉన్న ఆ ఓట్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాతపూర్వకంగా ఫిర్యాదు అందించారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలను కలెక్టర్‌కు అందించామని, ఈ ఓట్ల అంశంపై వారు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. రాష్ట్ర లీగల్ సెల్ సహాయ కార్యదర్శి ఎం.విఠల్‌రావు, కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి, కొండపల్లి బుజ్జి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఎంట్రన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఏపీ పాలిటెక్నిక్ డిప్లొమా బోర్డు జాయింట్ డైరెక్టర్ జానకిరామ్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు ఉచితంగా మెటీరియల్స్ అందజేసిన జానకి రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి.కుమార్ స్వామి, మాధవ్, సంతోష్, భార్గవ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో అభివృద్ధి వెలుగులు



వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం



వాంబే కాలనీ

- సచివాలయాలకు సొంత భవనాలు
- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు
- మినీ బస్టాండ్ నిర్మాణానికి ఏర్పాట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైన వాంబే కాలనీ నగరానికి దూరంగా విసిరివేసినట్లు ఉండేది. అజిత్ సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు అవతల వైపు ఉండే ఈ కాలనీలో పట్టణంలోని పేదలకు 40 గజాల స్థలంలో ఇళ్లు కేటాయించారు. 'ఏ' నుంచి 'జీ' వరకు ఆరు బ్లాకులుగా ఉండే ఈ కాలనీలో 3500కు పైబడి ఇళ్లు నిర్మించారు. ఇవికాక ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 32 ఫ్లాట్లు చొప్పున 'ఏ' బ్లాక్‌లో 16 అపార్ట్‌మెంట్లు, సీ- బ్లాక్‌లో 42 అపార్ట్‌మెంట్లు నిర్మించారు. తర్వాత కాలంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ గృహకల్ప కింద హెచ్ బ్లాక్ నిర్మించారు. ఇందులో హెచ్14, హెచ్ 2లో 19 హెచ్3లో 12 అపార్ట్‌మెంట్లు చొప్పున ఫ్లాట్స్ ఉన్నాయి. పూర్తిగా పేదలు నివసించే ఈ కాలనీ దశాబ్దంన్నర కాలంగా ఎటువంటి మౌలిక సదుపాయాలకు నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చింది. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి. రోడ్లు, డ్రైనేజీలు అంతంత మాత్రంగా ఉండేవి. కాలనీ వాసులు తమకు ఏ పని కావాలన్నా నగరంలోకి రావాల్సిన పరిస్థితి. చదువుకునే విద్యార్థులు సర్టిఫికెట్లు, ఇతరాలు ఏవి కావాలన్నా పడుతూ లేస్తూ నగరంలో ఉండే కార్యాలయాలకు రావాల్సి వచ్చేది. ఇరుకు రోడ్లలో నిత్యం ప్రమాదాలు జరిగేవి. పైగా కాలనీకి ఆనుకుని డంపింగ్ యార్డు ఉండడంతో ఇక్కడ ప్రజలు దుర్భరమైన జీవితాలు గడిపారు. ఒక దశలో ఇక్కడి ప్రజలు కాలనీ వదిలి పోదాం అన్నంతగా ఇబ్బందులు పడ్డారు.

కాలనీ స్వరూపం మార్చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాంబే కాలనీ స్వరూపం పూర్తిగా మారిపోయింది. కాలనీ వాసులు ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా ఇక్కడే అన్ని వసతులు అందబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ రాకతో కాలనీ వాసులు తమ ఇళ్ల వద్దే ఉండి తమకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు పొందుతున్నారు.

- వాంబే కాలనీలో 4 సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయి. సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించారు.
- రూ.కోటితో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. నిరంతరం వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.
- డంపింగ్ యార్డు సమస్య పరిష్కారమైంది.
- కాలనీలో ప్రధాన రహదారులు 60 అడుగుల డస్ట్ ఫ్రీ రోడ్లు చేశారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయింది.
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేశారు.
- 24 గంటల తాగునీటి సరఫరా జరుగుతోంది.
- నాడు- నేడు పథకం ద్వారా జేడీఎంసీ హైస్కూల్ అభివృద్ధి జరిగింది.

ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక శ్రద్ధతో...

ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాలనీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించారు. పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారు. మినీ బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. సకల సౌకర్యాలతో కాలనీని గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశారు. రవాణా, వైద్యం, విద్య అందుబాటులోకి వచ్చాయి. పేదల కాలనీ కాస్తా గేటెడ్ కమ్యూనిటీలా మారింది. ఇక్కడ స్థలాలు, ఫ్లాటుల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ ప్రాంతం ఖరీదైన ప్రాంతంగా మారిపోయింది.

ఆహ్లాదకరమైన పార్క్...

డంపింగ్ యార్డ్‌కు ఎదురుగా ఉన్న స్థలంలో అందమైన పార్క్ నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. త్వరలో పార్క్ నిర్మాణం పూర్తి చేసుకుని వాంబే కాలనీ వాసులకు ఆహ్లాదం పంచనుంది.

ఊహించని అభివృద్ధి



కాలనీ ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నా. గతంలో ఎటువంటి సౌకర్యాలు లేవు. చాలా ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊహించని రీతిలో అభివృద్ధి జరిగింది. రోడ్లు, డ్రైన్లు, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో కాలనీ అభివృద్ధి చెందింది. సచివాలయాల ద్వారా అన్ని పనులు ఎక్కడికీ వెళ్లకుండానే జరిగిపోతున్నాయి.

– ఎ.రామిరెడ్డి, వాంబే కాలనీ

మౌలిక సదుపాయాలు కల్పించారు



వాంబే కాలనీలో మంచి వసతులు అందుబాటులోకి వచ్చాయి. కాలనీ బాగా అభివృద్ధి చెందింది. అంతా ఈ నాలుగేళ్లలోనే జరిగింది. సచివాలయాలు నిర్మించారు. ఆసుపత్రి నిర్మాణం జరిగింది. బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కాలనీ నలువైపులా అభివృద్ధి ఆన వాళ్లు కనిపిస్తున్నాయి.

– ఫాతిమా, వాంబే కాలనీ

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



గవర్నర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగిందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో విజయవాడ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మరో అవకాశం ఇస్తే అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావుతో కలిసి జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆటో కార్మికులు, వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళుతుంటే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. తమకు పనిచేసే ఎమ్మెల్యే కావాలని, రౌడీ, గూండాయిజం చేసే ఎమ్మెల్యే వద్దని ప్రజలు ముక్త కంఠంతో చెబుతున్నారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొంత మంది వ్యాపారులను బెదిరించిన ఘటనలు కూడా తన దృష్టికి వచ్చాయన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని డివిజన్ వాసులకు వెలంపల్లి అభయమిచ్చారు.

ప్రతిపక్షానికి ఓటమి భయం పట్టింది

సెంట్రల్ నియోజకవర్గంలో ప్రతిపక్షానికి ఓటమి భయం పట్టుకుందని, ఆ భయంతోనే చంద్రబాబు నుంచి బొండా ఉమా వరకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. బాబు, పవన్‌లు వలంటీర్ వ్యవస్థను నానా విధాలుగా అవహేళన చేస్తూ మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తామని, నెలకు రూ.10వేలు ఇస్తామని సిగ్గూ, శరం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వలంటీర్ల చేత పెన్షన్లు పంపిణీ చేయించకుండా అడ్డుకుని వాళ్ల గొయ్యి వాళ్లే తవ్వుకున్నారన్నారు. నిమ్మగడ్డ రమేష్‌తో వలంటరీ వ్యవస్థపై దొంగ కేసులు బనాయించారన్నారు. వృద్ధుల ఉసురు పోసుకున్న దుర్మార్గులని దుయ్యబట్టారు.

లోకేష్, పవన్ ఇద్దరూ ఓడిపోతారు

చంద్రబాబు పుత్రుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ ఇద్దరికీ ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబుకు మతిభ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి స్థాయి అని చెప్పుకుంటూ చివరికి కార్పొరేటర్ స్థాయికి దిగజారాడన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల తర్వాత బీజేపీలో విలీనం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఒగ్గు విక్కీ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా సుధాకర్, కాపు సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, పసుమర్తి రాజేష్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లాహ్ దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

- ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా
- సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శాంతి, ప్రేమ, కరుణ వంటి మహ్మద్ ప్రవక్త బోధనలు అందరికీ ఆచరణీయమని, ఆ అల్లాహ్ దీవెనలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆకాంక్షించారు. నగరంలోని ముస్లిం మైనార్టీలకు, ప్రజలకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ మాసంలో ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారని, రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో వెలుగులు విరజిమ్మాలని ప్రార్థించారు. రంజాన్ పండుగ పర్వదినాన సింగ్‌నగర్, కండ్రిక మసీదులతో పాటు పైపులరోడ్డు సుందరయ్యనగర్ కట్ట వద్ద ఉన్న మజీద్ ఏ కరీ మున్నీసా, మదరసాల వద్ద ఈదుల్ ఫిత్రీ నమాజ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

సెంట్రల్ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి రంజాన్ పండుగ ప్రతీక అని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరసోదరీమణులకు బుధవారం వారు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలను తెలియజేశారు. దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గం చూపే గ్రంథం అని.. మహ్మద్ ప్రవక్త చూపించిన మార్గాన్ని ప్రతి ముస్లిం అనుసరించాలని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం, కరుణ పెంపొందాలని.. సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా జరుపుకొనే ఈ పండుగ అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపి ఆ అల్లాహ్ దీవెనలతో నియోజకవర్గ ప్రజలకు సకలశుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి
- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



అమ్మవారికి పూజలు చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత ఈశ్వరమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వెస్ట్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ముత్యాలంపాడు గ్రామదేవత ఈశ్వరమ్మ తల్లి ఉగాది సంబరాలలో భాగంగా బుధవారం దాత రుద్రరాజు వెంకట సుబ్బరాజు దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఆలయకమిటీ సభ్యులతో కలిసి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఈశ్వరమ్మ తల్లి కరుణా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయని అన్నారు. తొలుత ముత్యాలంపాడు గ్రామదేవతలు ఈశ్వరమ్మతల్లి, మహాలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సుమారు మూడు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఆలయకమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు కార్యదర్శి దాట్ల శివరామరాజు, కోశాధికారి సామంతపూడి చిన్నా, పీవీ సుబ్బరాజు వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భర్త, అత్త, మామలు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ నేతాజీ కాలనీలో మీసాల సుమలత తన భర్త విజయ్ కుమార్‌తో కలసి నివసిస్తున్నారు. వీరికి 2016లో వివాహం అయింది. ఇరువురు సంతానం ఉన్నారు. వివాహం అయిన దగ్గర నుంచి భర్త, అత్త మామలు సుమలతను మానసికంగా వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయబ్ ఖాజీగా సయ్యద్ అబ్దుల్ మాలిక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలో నూర్ ఏ ఇలాహీకు సంబంధించిన ఏరియా మినహాయించి పాత రాజరాజేశ్వరి పేట, కొత్త రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి ప్రభుత్వ నాయబ్ ఖాజీగా సయ్యద్ అబ్దుల్ మాలిక్ ను నియమించినట్లు విజయవాడ సిటీ ఖాజీ అబ్దుల్ ఖాదిర్ చిష్తి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నివశించే వారు వివాహాల కోసం సయ్యద్ మాలిక్ 74166 84737 ను సంప్రదించవచ్చునని ఖాజీ ఖాదిర్ చిష్తి తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఎనలేని అభివృద్ధి

- 58 వ డివిజన్ రూపురేఖలు మార్చిన వైనం
- వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి
- డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ 58వ డివిజన్ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డును సుందరవనంగా మార్చడంతో పాటు, రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, యూజీడీ లైన్లు వంటి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించిన గొప్ప ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 58వ డివిజన్‌లో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తే అందులో ప్రధానంగా ఈ 58వ డివిజన్ ఓ మోడల్ డివిజన్‌గా రూపాంతరం చెందిందన్నారు. ఇక్కడ దశాబ్దాలుగా పేరుకుపోయిన డంపింగ్ యార్డ్ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నగర శివారు ప్రాంతాలుగా పేరొందిన నందమూరినగర్, భారతమాత మందిరం రోడ్డు, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక కాలనీ, కనకదుర్గానగర్, ఇందిరానాయక్ నగర్, సన్‌సిటీ కాలనీ తదితర ప్రాంతాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్, అవుతు శ్రీనివాసరెడ్డి, వరలక్ష్మి, శోభన పాల్గొన్నారు.

చేసిన మంచిని చూసి ఓటు వేయాలి

26వ డివిజన్‌లో వెలంపల్లి సతీమణి ప్రచారం



26వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి సతీమణి శ్రీవాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చేసిన మంచిని చూసి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సతీమణి శ్రీవాణి విజ్ఞప్తి చేశారు. స్థానిక 26వ డివిజన్ మాచవరంలో బుధవారం వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా వెలంపల్లి సతీమణి, కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. నవరత్నాలతో ప్రతి ఇంటా నూతన వెలుగులు నింపిన జగనన్నకు మరోమారు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీక అని అన్నారు. స్నేహశీలి, సౌమ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెలంపల్లి మీనాక్షి 26వ డివిజన్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు వెలంపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెలంపల్లిని గెలిపించాలంటూ ప్రచారం



సంక్షేమపథకాల బ్రోచర్లు అందజేస్తున్న చక్రవర్తి

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని సెంట్రల్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 63వ డివిజన్ ఎల్ఐజీ ఉడా కాలనీ 1,2లలో చక్రవర్తి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో వుండే ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ పర్యటనలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ సెక్రటరీ మేడా రమేష్, డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, పార్టీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి పాల్గొన్నారు.

శ్రీరాముడు సకల గుణాభిరాముడు



ప్రసంగిస్తున్న కృష్ణకుమార్

విజయవాడ కల్చరల్: శ్రీరాముడు సకల గుణాభిరాముడని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీ కృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు పున్నమ్మతోటలోని టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమంలో శ్రీరామ జననంతో ప్రారంభించి శ్రీరామపట్టాభిషేకం వరకు జరిగిన అంశాలను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బైక్ ఢీకొని టీ వెండర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు రోడ్డు ఆర్‌సీఎం స్కూల్ ప్రాంతానికి చెందిన ఎ. తులసీరావు ఫ్లాస్క్‌లో టీ పెట్టుకుని షాపులకు అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టీ తీసుకుని చిట్టినగర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ వచ్చి ఢీ కొట్టింది. దీంతో తులసీరావుకు కుడికాలు మోకాలు వద్ద గాయమైంది. వెంటనే తులసీరావును 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

